సాక్షి రంగారెడ్డి
సోమవారం । 21 । అక్టోబర్ । 2024



రూపు మారనున్న వేళ

షాద్‌నగర్ పభుత్వ జూనియర్ కళాశాల రూపు మారనుంది. నూతన భవనానికి నేడు శంకుస్థాపన జరగనుంది. 8లో▸

ఉత్సాహంగా 'టార్చ్ రిలే'

హుడాకాంప్లెక్స్: గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం సీఎం కప్–2024 నిర్వహిస్తోందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. టార్చ్ రిలే ర్యాలీ ఈనెల 3న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమై 31 జిల్లాలు పూర్తి చేసుకుని రంగారెడ్డికి చేరుకుందని తెలిపారు. మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజినీర్ కళాశాల కమాన్ నుంచి ఉత్సాహభరితమైన వాతావరణంలో వేలాది మంది క్రీడాకారుల కేరింతల మధ్య ఆదివారం క్రీడాజ్యోతి ప్రారంభమై సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం చేరుకుంది. కార్యక్రమం ముగిసిన అనంతరం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో చీఫ్ మినిస్టర్ కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తామని శివసేనారెడ్డి తెలిపారు. పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేతల కోసం సీఎం కప్‌ను ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఫ్రూట్ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్ గణేశ్‌నాయక్, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, చంద్రారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా, స్టాఫ్ తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, జిల్లా క్రీడా యువజన సంక్షేమ అధికారి వెంకటేశ్వర్‌రావు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభిస్తున్న శివసేనారెడ్డి తదితరులు

సీఎం హామీలు ఏమయ్యాయి?

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

షాద్‌నగర్: అధికారం చేపడితే ప్రజలకు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టువేసి చెప్పాడని, ఆ హామీలు ఎందుకు అమలు చేయడంలేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌ఎస్ నేతలు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు నిత్యం పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే

- కాంగ్రెస్ పాలనలో సకల జనులకు ఇబ్బంది
- ఫార్మాపై పోరాటానికి సిద్ధం కావాలి
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి ఆధ్వర్యంలో దసరా సమ్మేళనం
- హాజరైన మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్రానికి కేసీఆర్ శ్రీరామ రక్ష అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బొంగ్లూర్ సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన అలయ్‌బలయ్ (దసరా సమ్మేళనం) కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సబితారెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను అద్దంలా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌దేనని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో సకల జనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను తిట్టుడు తప్ప అభివృద్ధిపై చిత్తశుద్ధి లే దని విమర్శించారు. ఫార్మాపై పోరాటం చేయాల్సిన బాధ్యత ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రజలపై ఉందన్నారు.

కలెక్టరేట్‌ను తరలించే కుట్ర

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ రంగారెడ్డి కలెక్టరేట్‌ను చేవెళ్ల, రాజేంద్రనగర్‌కు తరలించాలని చూస్తున్నారని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధిపై సోయి లేదన్నారు. పదేళ్లలో చేసిన అభివృద్ధిని ఆగం చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం ఫాక్స్‌కాన్‌కు వచ్చి చేసింది, చూసింది ఏమీ లేదన్నారు. కక్ష సాధింపు తప్ప కాంగ్రెస్ చేసేదేమీ లేదన్నారు. స్థానిక సంస్థల్లో ఆ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కృపేష్, చంద్రయ్య, అంజిరెడ్డి, కిషన్‌గౌడ్, రమేష్‌గౌడ్, మందా సురేష్, ఆకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–1కు ప్రత్యేక బస్సులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రూప్–1 పరీక్షకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్ప ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు గ్రామాల నుంచి పరీక్ష కేంద్రాలకు ఇబ్బంది లేకుండా చేరడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. మంగళ్‌పల్లి ఎక్స్ రోడ్డు నుంచి సీవీఆర్ కళాశాల వరకు బస్సులు నడిపిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలి

మంచాల: కాంట్రిబ్యూషన్ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మంచాలలో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత విధానాల ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భాగస్వామ్య పింఛను పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ 2015 నుంచి వివిధ కార్యక్రమాల ద్వారా ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా అనేక రూపాల్లో నిరసనలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

డ్రగ్స్ విక్రేతల అరెస్టు

యాచారం: డ్రగ్స్ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురిని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ కృష్ణంరాజు తెలిపిన వివరాలు.. రాజస్థాన్ నుంచి నగరంలోని నాదర్‌గుల్‌లో నివాసం ఉంటున్న సురేష్‌కుమార్, దినేష్‌కుమార్, సునీల్‌కుమార్‌లు నిషేధిత డ్రగ్స్ తెచ్చి బేగరికంచె సమీపంలోని అమెజాన్ కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు విక్రయిస్తున్నారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా కొంత కాలంగా డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి వంద గ్రాములు మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకొన్నారు. సమాచారం అందిన వెంటనే సకాలంలో స్పందించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఎస్ఐ తేజంరెడ్డిని సీఐ అభినందించారు.

గుండెపోటుతో బీజేపీ నేత మృతి

తుర్కయంజాల్: బీజేపీ సీనియర్ నాయకుడు సామ అల్వాల్‌రెడ్డి(51)ఆదివారం రాగన్నగూడలో గుండెపోటుతో మృతి చెందారు. మధ్యాహ్నం 12 గంటలకు గుండె నొప్పితో ఇంట్లో కుప్ప కూలడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఆయనకు భార్య సంధ్య, ఇద్దరు కూతుళ్లు దీక్షిత, వర్షిత ఉన్నారు. అల్వాల్‌రెడ్డి గతంలో రాగన్నగూడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆయన మృతికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, టిస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులు నివాళులర్పించారు.


అల్వాల్‌రెడ్డి (ఫైల్)

శిథిల కళాశాల.. రూపు మారనున్న వేళ

- పూర్వ విద్యార్థుల సహకారంతో ముందడుగు
- షాద్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం
- నేడు భూమి పూజ చేయనున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

షాద్‌నగర్: తాను చదువుకున్న సమయంలో కళకళలాడుతున్న కళాశాల ప్రస్తుతం సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. సరైన సదుపాయాలు లేక వెలవెలబోతుంది. అందుకే పూర్వపు విద్యార్థిగా కళాశాలకు కొత్త వెలుగులు తేవాలని సంకల్పించాడు. పూర్వ విద్యార్థులందరినీ ఏకం చేసి కళాశాలకు కొత్త రూపం తేవాలనుకున్నాడు. ఇందులో భాగంగా విరాళాలను పోగు చేసి కళాశాల రూపు రేఖలను మార్చేందుకు సన్నద్ధమయ్యాడు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. షాద్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

ఇదీ నేపథ్యం

షాద్‌నగర్ పట్టణంలో 70వ దశకంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత స్థానంతో ఉన్నారు. అయితే ప్రస్తుతం ఈ కళాశాల భవనం శిథిలావస్థకు చేరింది. విద్యార్థులకు సరైన సదుపాయాలు లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదులకు తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లు, మంచి నీటి సదుపాయం, మూత్రశాలలు సరిగా లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

మార్చేందుకు చర్యలు

1986– 88లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇక్కడే ఇంటర్ విద్యను అభ్యసించారు. అయితే ప్రస్తుతం కళాశాల శిథిలావస్థకు చేరడంతో తాను చదువుకున్న కళాశాలకు కొత్త రూపు తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గత రెండు నెలల క్రితం కళాశాల అభివృద్ధి కోసం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల భవన నిర్మాణానికి సహకరించాలని పూర్వపు విద్యార్థులను, దాతలను కోరారు.


శిథిలావస్థకు చేరిన జూనియర్ కళాశాల

సుమారు రూ.10 కోట్లతో పనులు

దాతలు ముందుకు రావడంతో కళాశాల ఆవరణలో ఉన్న 1.20 ఎకరాల విస్తీర్ణంలో మూడు అంతస్తుల్లో అత్యాధునిక సదుపాయాలతో సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. అయితే నూతన భవనంలో 34 తరగతి గదులు, 10 ల్యాబ్ రూంలు, ప్రిన్సిపాల్ గది, అడ్మిన్ గది, కాన్ఫరెన్స్ రూం, రెండు స్టాఫ్‌రూంలు, రెండు గ్రంథాలయ రూంలు, ఆడిటోరియాన్ని నిర్మించనున్నారు.

నేడే శంకుస్థాపన

దాతల సహకారంతో నిర్మించనున్న కళాశాల నూతన భవన నిర్మాణానికి సోమవారం ఉదయం శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని వెంటనే గద్దెదించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా రైతుబంధు పథకం నగదు జమ కాకపోవడంతో ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ సమీపంలో నాగార్జునసాగర్ రహదారిపై పార్టీ కార్యకర్తలతో రాస్తారోకో నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అన్నదాత కన్నీరు పెట్టలేదన్నారు. రైతేడ్చిన రాజ్యాం ఎద్దేడ్చిన వ్యవసాయం ఉండదన్నారు. రైతుల కోసం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి పెట్టుబడికి సాయం చేసింది మాజీ సీఎం కేసీఆరే అన్నారు. రైతుబంధుతో పాటు ప్రమాదవశాత్తు మరణించిన, సాధారణ మరణం చెందిన రైతుబీమాతో రూ.5 లక్షలు ఎలాంటి షరతులు లేకుండా ఇచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు రైతుబంధు ఇవ్వలేదన్నారు. దీంతో మళ్లీ అప్పులు చేసి అన్నదాతలు పంటలు సాగు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఆనాటి బీఆర్ఎస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు తగ్గిస్తే మళ్లీ అవి పెరిగే పరిస్థితి ఉందన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు అంజిరెడ్డి, రమేశ్‌గౌడ్, కిషన్‌గౌడ్, సీహెచ్.రమేశ్, చంద్రయ్య, జగదీష్, జానీపాషా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

24న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: పీడీఎస్‌యూ సంఘం ఏర్పడి యాభై ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈనెల 24న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే ఉత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.గీతమహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ వారు మాట్లాడుతూ.. ఉన్నతమైన ఆశయాలతో ఏర్పాడిన సంస్థ పీడీఎస్‌యూ అన్నారు. 50 ఏళ్ల పోరాట ప్రస్థానంలో విద్యార్థుల పక్షాన పీడీఎస్‌యూ బాధ్యతగా కొట్లాడిందన్నారు. కామ్రేడ్ జార్జిరెడ్డి, జేసీఎస్ ప్రసాద్‌ల అడుగుజాడల్లో నడుస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారన్నారు. ఈనెల 24న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించబోయే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభకు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, జైపాల్, అశోక్, సురేశ్, ప్రభాస్, తదితరులు పాల్గొన్నారు.

కుక్క కాటుకు మహిళ మృతి


లచ్చమ్మ (ఫైల్)

షాబాద్: కుక్క కాటుకు ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చిల్కమర్రి లచ్చమ్మ(55)ను ఈ నెల 16న ఇంటి పక్కనున్న ఓ వీధి కుక్క కరిచింది. ఆమెకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో చికిత్స నిమిత్తం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించి మృతిచెందింది. ఆదివారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి


కుర్వగూడలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి

షాబాద్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేశ్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో ఇంటింటికీ తిరిగి బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ జాతీయ నాయకత్వ ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి బూత్‌లో నిర్వహిస్తున్నారు. పార్టీని గ్రామ స్థాయిలోనూ మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి తెలియజేసి పార్టీలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పోలింగ్ బూత్ అధ్యక్షుడు మల్లేశ్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు నరేష్, రామకృష్ణ, అశోక్, సునీల్, శ్రీశైలం, శివ తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ కాన్వాయ్‌కి ప్రమాదం

నడన్ బ్రేక్ వేయడంతో ఒకదానికొకటి ఢీకొన్న మూడు కార్లు

శంషాబాద్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కాన్వాయ్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి ఢిల్లీ తిరుగు ప్రయాణం అవుతున్న దత్తాత్రేయ కాన్వాయ్‌తో ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు. వీరు ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారి వైపు వస్తుండగా..ముందు కారులో ప్రయాణిస్తున్న సర్ఫరాజ్ అనే వ్యక్తి మలుపు వద్ద ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న గవర్నర్ ఎస్కార్ట్ వాహనం ఢీకొంది. దీంతో దాని వెంటనే ఉన్న కాన్వాయ్‌లోని మరో మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఇందులో కార్లు దెబ్బతిన్నా ఎవరికీ ప్రమాదం చోటు చేసుకోలేదు. విషయం తెలుసుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సంఘటనకు కారణమైన వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. ముందు కారు నడుపుతున్న వ్యక్తి పేరు సర్ఫరాజ్ అని తెలిసింది.


కాన్వాయ్‌లో దెబ్బతిన్న కారు

కట్నం వేధింపులు.. గృహిణి ఆత్మహత్యాయత్నం

ఎన్ఆర్ఐ భర్త, అత్తామామల దుర్మార్గంపై పోలీసులకు ఫిర్యాదు

నాగోలు: ఎన్ఆర్ఐ భర్త, అత్తమామల వేధింపులు తట్టుకోలేక ఓ గృహిణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎల్‌బీనగర్ పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యులు తెల్పిన వివరాల మేరకు...రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గడ్డం మల్లయ్య గూడ గ్రామానికి చెందిన బత్తుల వాసుదేవ రెడ్డి కుమారుడు పవన్‌కుమార్‌కు తిప్పాయిగూడకు చెందిన వింజమూరి విఠల్‌రెడ్డి కూతురు నిఖితను ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం జరిపించారు. కట్నం కింద 55 తులాల బంగారం, రూ.5 లక్షలు నగదు, వెండి సామాను ఇచ్చి ఘనంగా వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే పెళ్లయిన కొద్దిరోజులకే మామ వాసుదేవరెడ్డి, అత్త అలివేలు, భర్త పవన్‌కుమార్‌లు అదనపు కట్నం కోసం వేధించారు. పెళ్లయ్యాక పవన్‌కుమార్ ఒక్కడే మొదట అమెరికాకు వెళ్లిపోయాడు. నిఖితను అమెరికాకు తీసుకెళ్లాలని ఎన్నిమార్లు కోరినా సరిగా స్పందించ లేదు. అదనంగా కట్నం ఇస్తేనే తీసుకెళ్తానని కరాకండిగా చెప్పడంతో ఇంట్లో ఉన్న బంగారం కుదవబెట్టి మరో రూ.7 లక్షల రూపాయలు పవన్‌కుమార్‌కు ఇచ్చారు. దీంతో నిఖితను అమెరికాకు తీసుకెళ్లిన పవన్‌కుమార్ అక్కడ కూడా వేధించడంతో ఆ బాధలు భరించలేక తిరిగి ఇండియాకు వచ్చేసింది. ఇక్కడ అత్తామామలు వేధించడంతోపాటు ఇటీవల నిఖితను పుట్టింట్లో వదిలేసి వెళ్లిపోయారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన నిఖిత ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నిఖితను హాస్పిటల్‌కు తరలించారు. తన కూతుర్ని వరకట్నం కోసం వేధించి ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్త, అత్తమామలపై విఠల్‌రెడ్డి ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'వర్గీకరణ'పై సుప్రీం తీర్పును అమలు చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం యథావిధిగా అమలు చేయాలని ఎంబీఎస్సీ (మోస్టు బ్యాక్‌వర్డ్ షెడ్యూల్ క్యాస్ట్) సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటన్న డిమాండ్ చేశారు. ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం షాద్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటన్న మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా ఎస్సీ కులాల జనగణన తర్వాతే ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. దళితులందరికీ కులధ్రువీకరణ పత్రాలు ఒకే అధికారి ద్వారా ఇవ్వాలని, ఎస్సీ ఉప కులాల నిరుద్యోగులకు 70శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలను కార్పొరేషన్ ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. ఎంబీఎస్సీ ఉపకులాలకు ఎస్సీ కమిషన్, ఎమ్మెల్సీ, రాజ్యసభ తదితర నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ధర్నా చౌక్ వద్ద చేపట్టే నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్, బాల్‌రాజ్, నాగరాజు, బీరయ్య, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి చొరబడి నగల అపహరణ

కేశంపేట: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన ఘటన ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేటకు చెందిన అనిత తన పిల్లలతో కలిసి కూలీ పనులు చేస్తూ జీవిస్తుంది. ఆదివారం కావడంతో అనిత ఇంటికి తాళం వేసి తన పిల్లలను వెంట తీసుకొని కూలీ పనికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు వెండి ఆభరణాలతో పాటుగా రూ.ఆరువేల నగదును దోచుకెళ్లారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపింది.

ట్రాక్టర్ చోరీ

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెళ్లి గ్రామంలో వ్యవసాయ పొలం వద్ద ఉంచిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బాలయ్య వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పనులు చేసేందుకు ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. అయితే శనివారం ఉదయం పొలం పనులు పూర్తి అయిన తర్వాత అక్కడే ట్రాక్టర్‌ను ఉంచి రైతు ఇంటికి వచ్చాడు. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ ఇంజన్‌తో పాటుగా ట్రాలీని దొంగిలించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతు తెలిపారు.

యువతి అదృశ్యం

షాబాద్: ఓ యువతి అదృశ్యమైన సంఘటన షాబాద్ మండలంలోని అంతారం గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎద్దుల మహేశ్ కోడలు (అక్క కూతురు) బావుల్లా సౌమ్య(20) శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత అందరితో నిద్రపోయింది. అర్ధరాత్రి మహేశ్ లేచి చూడగా ఆమె కనిపించడం లేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో మహేశ్ ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసిన్నట్లు తెలిపారు.

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా రాజేందర్‌గౌడ్

అత్తాపూర్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అల్వాల్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన ఆయనకు స్థానిక సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను నివారణకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని వారికి ఇస్తే వాహనాల యజమానులపై చర్యలు తప్పవన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడం ద్వారా అధిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశ రక్షణే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

తెలంగాణ ప్రాంత ప్రముఖ్ రాంప్రసాద్‌జీ

చేవెళ్ల: దేశ రక్షణ, హిందూ ధర్మ పరిరక్షణ కోసమే ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని తెలంగాణ ప్రాంత ప్రముఖ్, సంస్థ ప్రచారక్ రాంప్రసాద్‌జీ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను చేవెళ్ల ఖండ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుంచి పుర వీధుల గుండా స్వయం సేవకులు పథ సంచాలన్ చేపట్టారు. అనంతరం స్థానిక వివేకానంద కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని మేల్కొల్పడం, ప్రజలను చైతన్యవంతం చేయటం ఆర్ఎస్ఎస్ శాఖల ముఖ్య లక్ష్యమన్నారు. ప్రతిఒక్కరూ దేశం కోసం పనిచేయాలని సూచించారు. ప్రపంచానికి జ్ఞాన భిక్ష పెట్టిన భారత సంస్కృతి ఎంతో గొప్పదన్నారు. ప్రస్తుతం 60 దేశాల్లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. హిందూ దేవాలాయలపై ముష్కరుల దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఛత్రపతి శివాజీ, వివేకానంద వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లేశం, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాంప్రసాద్‌జీ

హమాలీలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

రాజేంద్రనగర్: రెక్కాడితేగానీ డొక్కాడని హమాలీ కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హమాలీ కార్మికుల జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం రాజేంద్రనగర్‌లోని ఏఆర్ దేవరాజ్ భవన్‌లో కె.రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో 20 లక్షలకు పైన హమాలీ కార్మికులు పని చేస్తున్నారని... సంఘటిత రంగం, అసంఘటిత రంగంలో వీరు పని చేస్తున్నారని అన్నారు. వీరికి ఎలాంటి భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హమాలీ సంఘం నూతన కమిటీని ప్రకటించారు. నూతన కమిటీకి ప్రధాన కార్యదర్శిగా కె.రామస్వామి, జిల్లా అధ్యక్షుడిగా యాదయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాజు, ఉప ప్రధాన కార్యదర్శిగా కృష్ణతో పాటు 21 మంది నూతన కమిటీని పానుగంటి పర్వతాలు ప్రకటించారు.